04062025-MAI-04_Layout 1 6/4/2025 1:11 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# ఆర్థిక వృద్ధిపై డంబాలు

**బడేభాయ్** నుంచి ఛోటేభాయ్ ట్రిలియన్ ఎకానమీ మంత్రాన్ని పుణికిపుచ్చుకున్నట్టు కనిపిస్తున్నది. తెలంగాణ కోసం ఇటు రాయి దీసి అటు పెట్టని సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా చేసిన ప్రసంగం బడాయి బాబు ఎచ్చులను బలాదూర్ చేసేలా ఉంది. రాష్ట్రాన్ని పదేండ్లలో లక్ష కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని, 2047 నాటికి 3 లక్షల కోట్ల డాలర్ల స్థాయికి తీసుకువెళ్తామని ఆయన అంటున్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో అభివృద్ధిని, సంక్షేమాన్ని సమతూకం చేసి తెలంగాణను సమున్నతంగా నిలబెడితే, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం దివాలా అంచుకు చేరుకున్నది. బీఆర్ఎస్ నేతృత్వంలో రాష్ట్రం సాధించిన ఆర్థికవృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం అతలాకుతలం చేసింది. జీఎస్డీపీ, తలసరి వృద్ధిరేటు నానాటికీ తీసికట్టవుతుండటమే నిదర్శనం. కాలు మోపిన నాడే తెలుస్తుంది కాపురం చేసే కళ అన్నట్టు రాష్ట్రాన్ని ఏడాదిన్నర కాలంలో అధోగతి పాలు చేసి, ఇప్పుడేమో అందలమెక్కిస్తామని ఊరిస్తున్నారు. పాలన వైఫల్యాల నుంచి, హామీల ఎగవేత నుంచి ప్రజల దృష్టి మరల్చడమే ఈ ఆడంబరపు మాటల వెనుకనున్న అసలు ఉద్దేశం అని తెలిసిపోతూనే ఉన్నది.

కేసీఆర్ హయాంలో 2023-24 జీఎస్డీపీ వృద్ధిరేటులో తెలంగాణ 3వ ర్యాంకుకు ఎదిగితే, కాంగ్రెస్ పాలనలో ఏడాది కాలంలోనే 14కు దిగజారింది. ఇక తలసరి ఆదాయంలో రాష్ట్రాన్ని కేసీఆర్ దేశంలోనే నంబర్ 1 స్థానంలో నిలబెడితే రేవంత్ సర్కారు దాన్ని 11వ స్థానానికి పడగొట్టింది. ఇప్పటిదాకా కాంగ్రెస్ సర్కార్ అప్పుచేసి పప్పు కూడు దారిలో పబ్బం గడుపుకొంటున్నది. అప్పులు పుట్టడం లేదని ఇల్లెక్కి కూసిన ఘనతను దక్కించుకున్నారు సీఎం రేవంత్. అందరూ తలో చేయి వేయమని తన చేతకానితనాన్నీ చాటుకున్నారు. ఇప్పుడా యనే అద్దంలో చందమామను చూపిస్తున్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో దిగదుడుపు చేసి రేపు ఎప్పుడో నంబర్ వన్ చేస్తానని డాంబికాలు పలుకుతున్నారు. ఉన్నది ఊడగొట్టి లేనిది తెస్తానని అంటున్నారు. ఆస్తుల కల్పన జరగడం లేదు. సంపద పెంచడం రాదు. పంచడం అసలే రాదు. ఆ మాటకు వస్తే ఆర్థికవ్యవస్థ పనితీరు సరిగా అర్థమైందా? అంటే అదీ సందేహాస్పదమే. అడ్డగోలుగా దంచిన హామీలను అటకెక్కించి, ప్రజలకు తక్షణావసరమైన సంక్షేమాన్ని పండబెట్టి ఏం అభివృద్ధి సాధిస్తారో, ఎవరి జేబులు నింపుతారో తెలియదు. ఆర్థికవ్యవస్థ పరిమాణం గురించి ఊదరగొట్టడం సరే, అందులో సామాన్యుడికి ఒరిగేదేమిటో చెప్తే బాగుండేది.


జూన్ 2 ప్రసంగంలో సీఎం రేవంత్ తన ప్రభుత్వ విజయాలంటూ ముఖ్యంగా రెండు పచ్చి అబద్ధాలను వల్లించారు. ఒకటి, ఏడాదిన్నర కాలంలోనే 60 వేల ఉద్యోగాలు ఇచ్చారట. రెండు, రైతులకు రుణ మాఫీ ఉపశమనం కల్పించారట. ఒక్క నోటిఫికేషన్ ఇవ్వకుండానే, కేసీఆర్ ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగాలకు నియామక పత్రాలు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ఇదివరకటి కేసీఆర్ ప్రక్రియ అంతా పూర్తిచేస్తే, ఆ ఉద్యోగాలను తన ఖాతాలో వేసుకోవడం నైతికంగా దిగజారుడుతనం కాక మరేమిటి? ఇక అరకొరగా జరిగిన రుణమాఫీని 'ప్రభుత్వ విజయమని' చెప్పుకోవడం ఏమిటి? రైతులను అడిగితే తెలుస్తుంది ఆ బండారం!

# మాటలు కాదు.. చేతలు కావాలి!



కమలేశ్ సింగ్

**భారత్ ప్రస్తుతం విచిత్రమైన పరిస్థితుల్లో చిక్కుకున్నది. చైనాతో మనకు సరిహద్దు సమస్యలున్నాయి. చైనాకు అమెరికాకు పొసగదు. అయినప్పటికీ, ఈ రెండు దేశాలూ పాకిస్థాన్‌కు ఎంతో దగ్గర. ఇప్పుడు అలాంటి పాక్‌తో మనం ఘర్షణలకు దిగాం. ఇక, భారత్‌కు పొరుగున ఉన్న బంగ్లాదేశ్, శ్రీలంక, మయన్మార్, మాల్దీవులతోనైనా మనకు సత్సంబంధాలున్నాయా? అంటే, అవును అంటూ గట్టిగా చెప్పలేని పరిస్థితి. ఇవన్నీ గమనించే.. ప్రధాని మోదీ 'ఇది యుద్ధాల సమయం కాదు.. బలంగా ఉంటేనే శాంతి స్థాపన జరుగుతుంది' అని ప్రకటించారు. ఇక్కడ బలమంటే సైనిక శక్తి మాత్రమే కాదు, దేశ ఆర్థిక స్థిరత్వం కూడా. భారత్ వంటి అత్యధిక జనాభా కలిగిన దేశానికి ఇప్పుడు ఆర్థికపరిపుష్టి ఎంతో అవసరం.**



**మేకిన్ ఇండియా ఇలా..**

| | |
|---|---|
| 25% | జీడీపీలో తయారీ రంగం వాటా (లక్ష్యం) |
| 13% | జీడీపీలో తయారీరంగం వాటా (ప్రస్తుతం) |
| 58 ఏండ్ల కనిష్ఠం | ఎంతకు దిగజారిందంటే? |

**స్కిల్ ఇండియా ఇలా..**

| | |
|---|---|
| 2022 నాటికి శిక్షణ ఇవ్వాల్సింది | 40 కోట్ల మందికి |
| ప్రస్తుతం శిక్షణ పూర్తయినవారు | 4 కోట్ల మంది |
| లక్ష్యాన్ని చేరుకున్నది | 10% |
| చైనా శ్రామికశక్తిలో నైపుణ్యవంతులు | 60% |
| భారత శ్రామిక శక్తిలో నైపుణ్య వంతులు | 10% |

**22** ఏండ్లు కష్టపడాల్సిందే..: 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని 'వికసిత్ భారత్' పేరిట ప్రధాని మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆర్థిక పరిమాణం విషయంలో భారత్‌ను ప్రపంచంలోనే అగ్రస్థానంలో నిలపడమే తమ లక్ష్యమని చెప్పుకొచ్చారు. ఇది జరుగాలంటే వచ్చే 22 ఏండ్ల పాటు భారత జీడీపీ వృద్ధిరేటు కనీసం 7.8 శాతంగా నమోదవ్వాలని గత నెలలో ప్రపంచబ్యాంకు ఓ నివేదికలో వెల్లడించింది. అయితే, గడిచిన ఆర్థిక సంవత్సరం మన జీడీపీ వృద్ధిరేటు 6.5 శాతంగానే నమోదైంది. 4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చెప్తున్న భారత్.. ఏటికేడాది 8.5 శాతం వృద్ధిరేటు నమోదు చేస్తే ప్రతీ సంవత్సరం 340 బిలియన్ డాలర్ల సొమ్ము ఆర్థికవ్యవస్థకు అదనంగా చేకూరుతుంది. ఇది పాకిస్థాన్ మొత్తం జీడీపీకి సమానం. ఇంతటి సొమ్ము ఏటికేడాది మన ఆర్థికవ్యవస్థకు అదనంగా జత కలిస్తేనే, రక్షణ దళానికి అవసరమైన ఆయుధాలు, మౌలిక సదుపాయాలను ఏర్పాటుచేసుకోగలం. లక్షల మందిని పేదరికం నుంచి బయటపడేయగలం. అది జరుగని పక్షంలో అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను తీర్చిదిద్దలేం. ప్రపంచంలో మనది ఇప్పుడు నాలుగో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా కొందరు చెప్పుకొంటున్నారు. అయితే, ఇదే సమయంలో దేశంలో ఒక్కో పౌరుడి తలసరి ఆదాయం ఎంత ఉన్నదో కూడా చూడాల్సి ఉంటుంది. దేశంలో జనాభా పెరుగుతూనే ఉన్నది. దీనికి అనుగుణంగా ఆర్థికవ్యవస్థ పరిమాణం పెరగాల్సి ఉంటుంది. త్వరలో మూడో స్థానంలో ఉన్న జర్మనీని కూడా మనం దాటేయగలమేమో గానీ, చైనాను కాదు. ఎందుకంటే ఆర్థిక పరిమాణంలో చైనాకు, మనకు ఎంతో అంతరం ఉన్నది.

**'వికసిత్ భారత్ 2047' లక్ష్యం చేరాలంటే?**

| | |
|---|---|
| అవసరమైన జీడీపీ వృద్ధిరేటు 7.8% | ఎన్నేండ్ల పాటు నమోదు కావాలి 22 ఏండ్లు |
| ప్రస్తుతం జీడీపీ వృద్ధిరేటు 6.5% | వ్యత్యాసం 1.3% |

**మూడు విడతలు ఇలా..:** మన్మోహన్‌సింగ్‌ను ప్రధానిగా కంటే ఆర్థికమంత్రిగా ఎక్కువగా గుర్తిస్తారు. 90వ దశకంలో ఆయన తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలే దీనికి కారణం. ఆయన ఆర్థికమంత్రిగా ఉన్నప్పుడు జీడీపీ వృద్ధిరేటు 1.25 శాతం నుంచి 7.5 శాతం వరకూ ఎగబాకింది. ఐదేండ్ల వ్యవధిలో విదేశీ మారక నిల్వలు నాలుగు రెట్లు పెరిగాయి. పేదరికం స్థాయిలూ తగ్గుముఖం పట్టాయి. ఇక, మోదీ మూడు పర్యాయాల పాలన విషయానికి వస్తే.. తొలి విడతలో హామీలతో నింపారు. మేకిన్ ఇండియా, జీఎస్టీ, ఎఫ్‌డీఐ, భూ సంస్కరణల పేరిట పలు వాగ్దానాలు ఇచ్చారు. భూ సంస్కరణల హామీ ఎప్పుడో అటకెక్కింది. ఇక, రెండో పర్యాయం అంతా.. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, సాగుచట్టాలు, కరోనా సంక్షోభంతో కొనసాగింది. మూడోసారి అధికారం చేపట్టి ఏడాది గడిచినప్పటికీ, గొప్ప నిర్ణయాలేమీ కనిపించట్లేదు.

**పదునులేని పథకాలు:** వ్యాపారం చేయడం ప్రభుత్వం పనికాదంటూ ప్రభుత్వరంగ సంస్థల్లో (పీఎస్‌యూ) పెట్టుబడుల ఉపసంహరణకు మోదీ ప్రభుత్వం తలుపులు బార్లా తెరిచింది. అయితే, లాభాల్లో ఉన్న సంస్థలను విక్రయించడంపై విమర్శలు వచ్చాయి. ఒక్క ఎయిర్ ఇండియా విక్రయమే సజావుగా సాగినట్టు చెప్తారు. ఇదే సమయంలో 'మేకిన్ ఇండియా' లక్ష్యాన్ని కూడా ప్రభుత్వం చేరుకోలేకపోయింది. 'మేక్ ఇన్ ఇండియా' ద్వారా జీడీపీలో తయారీరంగం వాటాను 25 శాతానికి తీసుకువెళ్లాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. అయితే, ప్రస్తుతం జీడీపీలో తయారీ రంగం వాటా 13 శాతానికి పడిపోయింది. 1967 తర్వాత ఇదే కనిష్ఠం. ఇక, 2015లో తీసుకొచ్చిన 'స్కిల్ ఇండియా' పథకం కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. 2022 నాటికి దేశంలో 40 కోట్ల మంది యువతకు నైపుణ్యాన్ని మెరుగుపర్చాల్సి ఉండగా, 4 కోట్ల మందికి కూడా ఈ పథకం కింద శిక్షణను ఇవ్వలేకపోయారు. చైనా శ్రామిక శక్తిలో 60 శాతం మందిలో నైపుణ్యాలుంటే, భారత్‌లో ఇది 10 శాతానికి మించి ఉండదు. ఇలాంటి సమయంలో జీడీపీ వృద్ధిరేటు ఎలా పరుగు పెడుతుందన్నది ప్రధాన ప్రశ్న.

**నల్ల చట్టాలపై బ్యాక్ స్టెప్:** దేశంలో 45 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అయితే, జీడీపీలో సాగురంగం వాటా 15 శాతంగానే ఉన్నది. ఇక, 2020లో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. తమను సంప్రదించకుండా తీసుకువచ్చిన ఈ నల్ల చట్టాలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోబోమని అన్నదాతలు తెగేసి చెప్పారు. ఆందోళనలు మిన్నంటడంతో దిగివచ్చిన ప్రభుత్వం వాటిని వెనక్కి తీసుకున్నది. ఒకవేళ, నిజంగా ప్రభుత్వం చెప్తున్నట్టు వ్యవసాయ దిగుబడిని పెంచి, రైతుల క్షేమం కోసమే ఈ చట్టాలను తీసుకొచ్చినట్టయితే, రైతులతో ముందే ఎందుకు సంప్రదింపులు చేపట్టలేదు? ప్రభుత్వాన్ని ఏ శక్తి ఆపింది? ఇక, రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామన్న హామీని కూడా ప్రభుత్వం నిలబెట్టుకోలేదు.

**ఇండియా ఎట్ క్రాస్‌రోడ్స్:** పాక్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా పార్టీలతో సంబంధం లేకుండా అన్నిపక్షాలూ ఏకతాటిమీదికి వచ్చాయి. ఇప్పుడు దేశార్థికాభివృద్ధికి ప్రధాని మోదీ అందరినీ ఏకతాటిమీదికి తీసుకురావాలి. ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం చేస్తామన్న ప్రధాని.. '2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్'ను మార్చడానికి కూడా అలాంటి రాజీలేని పోరాటమే చేయాలి. ఇప్పుడు భారత్ కూడలిలో ఉన్నది. 6.5 శాతం వృద్ధిరేటుతో గల్లీ ప్లేయర్‌గా ఉంటుందో, లేక ఆర్థిక సంస్కరణలతో 10 శాతం వృద్ధిరేటు సాధించి గ్లోబల్ ప్లేయర్‌గా మారుతుందో చూడాలి. అప్పుడే దేశంలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. సైన్యానికి అవసరమైన డ్రోన్లు, ఆయుధాలను కొనగలం. 1991లో నెలకొన్న ఆర్థిక సంక్షోభాన్ని మన్మోహన్ ఓ అవకాశంగా మలుచుకొన్నారు. ఇప్పుడు మోదీ కూడా అదే పనిచేయాలి. వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలి. మేకిన్ ఇండియా, స్కిల్ ఇండియాను రీలోడ్ చేయాలి. రాజకీయాలకు సమయం ఉండనే ఉన్నది. అయితే, వృద్ధిరేటు మాత్రం మన కోసం వేచిచూడదు. మూడు దశాబ్దాల నిర్విరామ కృషి ఫలితంగానే చైనా ఆర్థికాభివృద్ధి సాధించింది. భారత్ కూడా ఆర్థికరంగంలో ముందుకుసాగాలంటే ఇప్పుడు మోదీ తనలోని ఆర్థిక సంస్కరణల మన్మోహన్‌ను నిద్రలేపాలి గానీ, సోషలిస్ట్ పాలసీలు పెనవేసుకున్న నెహ్రూను కాదు.

(వ్యాసకర్త: రాజకీయ విశ్లేషకులు)

## ఫీజుల నియంత్రణ ఎక్కడ?

రాష్ట్రంలోని కార్పొరేట్ పాఠశాలలు అడ్మిషన్ల ముసుగులో ఫీజుల మోత మోగిస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లోనైతే అప్పుడే అడ్మిషన్లు అయిపోయినట్టు బోర్డులు పెడుతున్నారు. కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు... తమకు ఏ నిబంధనలు వర్తించవని, తమ నిబంధనలు తమవే అన్నట్టుగా ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నాయి. అయినా రాష్ట్ర ప్రభుత్వం తమకేం పట్టదన్నట్టుగా చోద్యం చూస్తున్నది. కొన్ని పాఠశాలల్లోనైతే ఒకేసారి మొత్తం ఫీజు కట్టాలనే నిబంధనలను అమలుచేస్తున్నారు. లేకుంటే అడ్మిషన్ ఇవ్వలేమంటూ విద్యార్థుల తల్లిదండ్రులను భయాందోళనలకు గురిచేస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణ చేస్తామని ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం కొలువుదీరాక మాత్రం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లు మండల స్థాయి వరకు విస్తరించి ఇష్టారీతిన ఫీజులు వసూలు చేస్తుంటే, ప్రభుత్వాధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారు. పేద, మధ్యతరగతి తల్లిదండ్రుల కష్టార్జితాన్ని ఈ కార్పొరేట్, ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు సొమ్ము చేసుకుంటున్నాయి. ఇదిలా ఉంటే యూనిఫామ్స్, బుక్స్, నోట్ పుస్తకాల పేరిట ఇష్టం వచ్చినట్టు బిల్లులు వేస్తున్నారు. ఇవి తమ వద్దే కొనాలని, లేకుంటే విద్యార్థులను లోపలికి రానీయమంటూ హుకుం జారీ చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా చాలావరకు కార్పొరేట్ స్కూళ్లు ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్య పుస్తకాలను వాడటం లేదు. ఆయా స్కూళ్లు రూపొందించిన పాఠ్యపుస్తకాల ద్వారానే విద్యార్థులకు బోధన చేస్తున్నారు. వాటిని తమ పాఠశాలల్లోనే కొనాలని చెప్పి ఫీజులకు, పుస్తకాలకు మెలిక పెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి. ఫీజు నియంత్రణ చట్టం తీసుకువచ్చి విద్యార్థులకు ఉపశమనం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

**- సొప్పరి నరేందర్ ముదిరాజ్**
హైదరాబాద్ విశ్వవిద్యాలయం విద్యార్థి

## జననీ జన్మ భూమిశ్చ..



'కర్మభూమి మీద కార్యదక్షులై వర్ధిల్లండి. కానీ, జన్మభూమి రుణం తీర్చుకోండి. తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి. రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నదని చూడకండి. మీరు పుట్టిన గడ్డ తెలంగాణ అనే విషయాన్ని మర్చిపోకండి' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డాలస్‌లో తెలంగాణ ఎన్నారైలకు పిలుపునిచ్చారు. ఏ పార్టీ ఉన్నదని చూడకుండా పెట్టుబడులు పెట్టాలని పిలుపునివ్వడం ద్వారా ఆయన తన రాజనీతిజ్ఞతను, తెలంగాణ పట్ల తనకున్న ప్రేమను, బాధ్యతను చాటుకున్నారు.

2025, జూన్ 2 తెలంగాణ అవతరణ దినోత్సవం వేళ కేటీఆర్ అగ్రరాజ్యం అమెరికాలోని డాలస్ వేదికగా రాష్ట్ర వైభవాన్ని యావత్ ప్రపంచానికి చాటిచెప్పారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డనాడు ఉన్న పరిస్థితి నుంచి రాష్ట్రం ఒక ఫీనిక్స్ పక్షి వలె ఎలా అభివృద్ధి దిశలో దూసుకువెళ్లిందో అన్ని గణాంకాలతో సహా కేటీఆర్ వివరించారు. ఎక్కడా ఆయన రాజకీయ విమర్శలకు దిగలేదు. ఆరోపణలు చేయలేదు. కేవలం తెలంగాణ అభివృద్ధే ఎజెండాగా ఆయన తన ప్రసంగాన్ని సాగించారు. 'ఏ దేశమేగినా.. ఎందుకాలిడినా.. పొగడరా నీ తల్లి భూమి భారతిని అని' ఓ కవి చెప్పినట్టుగా.. ఏ దేశమేగినా తెలంగాణ గడ్డను మర్చిపోవద్దని కేటీఆర్ ఎన్నారైలకు పిలుపునిచ్చారు. తెలంగాణ అభివృద్ధికి ఎన్నారైల అవసరం ఎంతో ఉన్నదని నొక్కిచెప్పారు. భౌతికంగా వారు తెలంగాణకు రాలేకపోయినా.. వారి విజ్ఞానం, ఆలోచనలు, వారు పెట్టే పెట్టుబడులు తెలంగాణను దేశంలోనే అగ్రరాష్ట్రంగా నిలబెడుతాయని వారి అవశ్యకతను చాటిచెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఎన్నారైలు పోషించిన పాత్ర మరువలేనిదని గుర్తుచేశారు. ఇక ముందు కూడా వారి పాత్ర అలాగే కొనసాగాలని కోరారు. ఎన్నారైలు అంటే నాన్ రెసిడెంట్ ఇండియన్స్ కాదని, ఎన్నారైలు అంటే 'నెసెసరి రెసిడెంట్స్ ఆఫ్ ఇండియా' అనే కొత్త నిర్వచనం ఇచ్చారు. తెలంగాణ ఎన్నారైలంతా రత్నాలని, భరతమాత ముద్దుబిడ్డలని కొనియాడారు. రాష్ట్ర సరిహద్దుల్లో మనం ఉంటే తెలంగాణ ప్రజలమని, రాష్ట్ర సరిహద్దు దాటితే తెలుగువాళ్లమని, దేశ సరిహద్దులు దాటితే భారతీయులం అని చెప్పిన కేటీఆర్ తన విశాల దృక్పథాన్ని చాటుకున్నారు.

ఎన్నారైలను పెట్టుబడులు పెట్టాలని కోరడమే కాకుండా, వారు ఎదుర్కొంటున్న సమస్యలను కేటీఆర్ ప్రస్తావించారు. ముఖ్యంగా ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక అమెరికాలో భారతీయ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. విద్యార్థుల కోసం అవసరమైతే బీఆర్ఎస్ పార్టీ తరపున ప్రత్యేకంగా ఒక లీగల్ సెల్ ఏర్పాటు చేస్తామని, ఇది భారతీయ విద్యార్థులందరికీ సాయం చేస్తుందన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లలను చదువుల కోసం అమెరికాకు పంపించారని, దీన్ని విద్యార్థులంతా మర్చిపోవద్దని కోరారు. కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని, తను కూడా అవసరమైన సాయం చేస్తానని భరోసా ఇచ్చారు.

ఎంతో హుందాగా సాగిన కేసీఆర్ ప్రసంగానికి ఎన్నారైలంతా మంత్రముగ్ధులయ్యారు. ఆయన ప్రసంగం ఆసాంతం చప్పట్లు కొడుతూ తమ మద్దతు ప్రకటించారు. వాస్తవానికి కేటీఆర్ ఎక్కడా రాజకీయ కోణంలో ప్రసంగాన్ని సాగించకపోయినా అక్కడ ఎన్నారైలు మాత్రం కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారని కేటీఆర్ అన్న సమయంలో గట్టిగా అరుస్తూ, చప్పట్లు కొట్టారు. ఈలలు వేస్తూ తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఓట్ల సమయంలోనే ప్రజల వద్దకు వెళ్లే రాజకీయ నాయకులున్న ఈ కాలంలో ఎక్కడో సప్త సముద్రాల ఆవల ఉన్న తెలంగాణ ప్రజలను గుర్తు పెట్టుకొని మరీ వారి వద్దకు వెళ్లి, వారి సేవలను గుర్తించి, వారి సాయం కోరి, వారికి మేమున్నామనే భరోసా అందించడం అనేది వర్తమాన రాజకీయాల్లో నిజంగా కొత్త ఒరవడే.

**- శ్రీధర్ ప్రసాద్,** 95054 05950
(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)

# అమెరికా వర్సిటీల్లో నిరసనల వెల్లువ!



నాంచారయ్య మెరుగుమాల

**మేఘా వేమూరి అనే ఎంఐటీ తెలుగు విద్యార్థి చరిత్ర సృష్టించింది. ప్రపంచ ప్రఖ్యాత అమెరికా యూనివర్సిటీ మెసాచూసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ)లో గత గురువారం జరిగిన అధికారిక కార్యక్రమంలో క్లాస్ ఆఫ్ 2025 ప్రెసిడెంట్ కూడా అయిన మేఘా, పాలస్తీనాకు అనుకూలంగా మాట్లాడుతూ అమెరికా, తన వర్సిటీ ఎంఐటీ అనుసరిస్తున్న ఇజ్రాయెల్ అనుకూల విధానాలపై నిప్పులు చెరిగింది. మెరుగైన జీవనశైలితో కూడిన 'బంగారు భవిత' కోసం తెలుగు రాష్ట్రాల్లో బీటెక్, ఇతర సాంకేతిక కోర్సులు పూర్తిచేసి ఎంఎస్, బీఎస్ చదవడానికి అమెరికా యూనివర్సిటీల్లో చేరడానికి పరుగులు తీసే వేల మంది తెలుగు విద్యార్థుల వంటిదాన్ని కాదని మేఘా వేమూరి తన క్యాంపస్ ప్రసంగం ద్వారా నిరూపించింది.**

మేఘా అమెరికాలోని జర్జియా తెలుగు కుటుంబంలో పుట్టి పెరిగిన యువతి కావడం వల్లే ఇంతటి ధైర్యసాహసాలు ప్రదర్శించిందనుకుంటే అది పూర్తిగా నిజమనిపించుకోదు. ఇండియా నుంచి వెళ్లిన కొద్ది మంది ఉత్తరాది, కర్ణాటక విద్యార్థులు కూడా మేఘా మాదిరిగానే అమెరికా ప్రభుత్వ నియంతృత్వ లేదా అక్రమ విధానాలను తప్పుపట్టిన సందర్భాలు గత రెండేండ్లలో లేకపోలేదు. సాధారణంగా రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అమెరికా వెళ్లి యూజీ, పీజీ కోర్సులు చదివే విద్యార్థులు రాజకీయ వాసన ఉండే ఇలాంటి నిరసనలకు దూరంగా ఉంటారు. నాలుగేండ్ల ఎంఐటీ అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులో కంప్యూటర్ సైన్స్, న్యూరో సైన్స్, లింగ్విస్టిక్స్ చదివిన మేఘా మే 29 ప్రసంగం కారణంగా స్నాతకోత్సవంలో ఆమె పాల్గొనడాన్ని ఎంఐటీ యాజమాన్యం నిషేధించింది. ఆమె డిప్లొమాను తమ ఇంటికి పంపుతారని మేఘా తండ్రి శరత్ వేమూరి తెలిపారు. ఇజ్రాయెల్ పాలస్తీనా వివాదం విషయంలో అమెరికా వైఖరిని తప్పుబడుతూ మాట్లాడిన పలువురు అంతర్జాతీయ విద్యార్థులపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సర్కారు ఇప్పటికే చర్యలు తీసుకున్నది. వారి వీసాల రద్దుకు అగ్రరాజ్యం చేసిన ప్రయత్నాలను అనేక సందర్భాల్లో అమెరికా కోర్టులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ఏపీలోని కృష్ణా జిల్లా ఘంటశాల గ్రామంలో మూలాలున్న మేఘా ఎం వేమూరి తన ప్రజాస్వామిక ప్రసంగం ద్వారా అమెరికా యూనివర్సిటీల్లో అక్కడి జనానికి ఆదర్శప్రాయంగా రాజ్యాంగం పేర్కొనే విలువల ప్రాధాన్యాన్ని ప్రపంచ ప్రజలకు గుర్తుచేసింది. అంతేకాదు, 2023 అక్టోబర్ మొదటివారం ఇజ్రాయెల్‌లో గాజా ప్రాంతం నుంచి పాలస్తీనా తీవ్రవాద సంస్థ హమాస్ దాడి తర్వాత పరిణామాలు మానవాళికి దిగ్భ్రాంతి పరిచేలా ఉన్నాయి. గాజాలోని పాలస్తీనా అరబ్‌లకు తిండి, తాగునీరు లేకుండా చేస్తూ దవాఖానలపై ఇజ్రాయెలీ సేనలు గత రెండున్నరేండ్లుగా దాడులు చేస్తున్నాయి. ఈ యూదు దురహంకార దేశం దాడులు, అణచివేత విధానాల ఫలితంగా గాజాలో ఒక్క వర్సిటీ కూడా లేకపోవడం సిగ్గుచేటని ఎంఐటీ ప్రసంగంలో మేఘా వేమూరి తేల్చిచెప్పింది. మరో పక్క గాజా పట్టీని అమెరికాకు స్వాధీనం చేయాలంటూ డొనాల్డ్ ట్రంప్ అడ్డగోలుగా మాట్లాడుతూనే ఉన్నారు. అమాయక గాజా జనంపై దాష్టీకాలను ఖండిస్తూ 2024 వేసవి ముందునుంచే అమెరికా విశ్వవిద్యాలయాల్లో శ్వేత జాతి, అంతర్జాతీయ విద్యార్థులు నిరసనలు తెలుపుతున్నారు. మొన్నటి మేఘా వేమూరి ప్రసంగం అమెరికా వర్సిటీల్లో 1960ల చివరినాటి వియత్నాం యుద్ధానికి వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమాలు, ప్రదర్శనలను అన్నితరాల వారికి గుర్తుచేసింది. భారతదేశం నుంచి ముఖ్యంగా తెలుగు ప్రాంతాల నుంచి అమెరికాకు డాక్టర్లు, ఇంజినీర్లు వలస పోవడం 1960ల్లోనే మొదలైంది. డెమొక్రాటిక్ పార్టీకి చెందిన అధ్యక్షుడు లిండన్ జాన్సన్ హయాంలో దేశంలోకి వృత్తి నిపుణుల వలసలను ప్రోత్సహించేలా చట్టాలు చేశారు. మరి ఈ నేపథ్యంలో అప్పుడు వియత్నాంలో అమెరికా సేనల ఆగడాలను దునుమాడుతూ అమెరికా విశ్వవిద్యాలయాల్లోని విద్యార్థులు వేల సంఖ్యలో వీధుల్లోకి రావడం సంచలనంగా మారింది. అంతేగాక అగ్రరాజ్యం విదేశాంగ విధానం మారడానికి కూడా దారితీసింది.





**వియత్నాం యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలతో అట్టుడికిన అమెరికా యూనివర్సిటీలు:** వియత్నాంలో సామ్రాజ్యవాద వ్యతిరేక, జాతీయ విమోచన పోరాటాన్ని అణచివేయడానికి కమ్యూనిస్టు వ్యతిరేకత పేరుతో అమెరికా తన సేనలు పంపి అమానుష రీతిలో కార్పెట్ బాంబింగ్ చేయడాన్ని, తమను ఆ యుద్ధంలో పాల్గొనడానికి బలవంతంగా పంపడాన్ని అమెరికా యువత 1960 ల చివరిలోనే తీవ్రంగా నిరసించింది. వందలాది అమెరికా యూనివర్సిటీల విద్యార్థులు వీధుల్లోకి వచ్చి పోలీసులతో ఘర్షణలకు సైతం వెనుకాడకుండా శాంతియుత మార్గంలో పోరాడారు. 1968లో వియత్నాం యుద్ధానికి నిరసనగా న్యూయార్క్‌లోని ప్రపంచ ప్రఖ్యాత కొలంబియా యూనివర్సిటీలో ఉవ్వెత్తున నిరసన జ్వాలలు రగిలాయి. ఇప్పుడు కూడా గాజా ప్రజలపై అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ దమనకాండకు నిరసనగా కొలంబియా వర్సిటీ విద్యార్థులు ప్రదర్శనలు జరిపారు.

**ఆరు దశాబ్దాల్లో అమెరికా జనం గళంలో వచ్చిన చెప్పుకోదగిన మార్పు:** అయితే 1965 నుంచి 2025 వరకూ ఆరు దశాబ్దాల కాలంలో అమెరికా ప్రజల రాజకీయ భావాల్లో అనూహ్య మార్పులు వచ్చాయి. అతి గొప్ప ప్రజాస్వామ్య దేశంగా పేరు మోసిన అమెరికాలో ప్రజాతంత్ర వ్యతిరేక ధోరణులు 45 ఏండ్ల కిందటే అంటే 1980 అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి, హాలీవుడ్ మాజీ నటుడు రోనాల్డ్ రీగన్ గెలుపుతో పెల్లుబికాయి. మార్పును వ్యతిరేకించి మితవాద ధోరణులు అట్లాంటిక్ ఆవలి అగ్రరాజ్యంలో అప్పుడే మొదలయ్యాయి. ఈ అప్రజాస్వామిక, పెత్తందారీ అనుకూల పోకడలు 2000 ఎన్నికల్లో గెలిచిన మరో రిపబ్లికన్ జార్జి డబ్ల్యూ బుష్ హయాంలో మరింత ముదిరాయి. చివరికి ఇలాంటి రాజకీయ ధోరణులు జనంలో ఇంకా ముదిరిపాకాన పడటం 2016, నవంబర్ ఎన్నికల్లో ప్రస్తుత ప్రెసిడెంట్ ట్రంప్ తొలిసారి గెలుపునకు దారితీసింది. ట్రంప్ 2024 చివరలో రెండోసారి విజయం సాధించడానికి ఆరు నెలల ముందు నుంచే అమెరికా వర్సిటీల్లో ఇజ్రాయెల్ వ్యతిరేక నిరసనలు వెల్లువెత్తాయి. ఇంత జరుగు తున్నా అమెరికా ప్రజల్లో ఇజ్రాయెల్‌కు వ్యతిరే కంగా ఆగ్రహావేశాలు అంతగా వ్యక్తం కావడం లేదు.

> వియత్నాం యుద్ధ కాలం నాటి ప్రజాస్వామిక స్పృహ జనంలో కనిపించడం లేదు. యూదు జాత్యహంకారానికి వ్యతిరేకంగా రావాల్సినంత వ్యతిరేకత రావడం లేదు. అంటే అమెరికన్లు మార్పును వ్యతిరేకించే అభివృద్ధి నిరోధకులుగా మారిపోయారా?

ఎంఐటీలో సామ్రాజ్యవాద వ్యతిరేక ధోరణులపై పోరాడే భావనలు ప్రచారం చేసే 'రిటెన్ రివెల్యూషన్' అనే విద్యార్థి సంస్థలో చురుకుగా పని చేసే మేఘా వేమూరి వంటి స్థానిక విద్యార్థులు ఎంతమంది తమ వర్సిటీల వేదికలపై ఎంతకాలం పోరాడితే అమెరికాలో ప్రజాస్వామిక విలువలు మళ్లీ వేళ్లూనుకుంటాయో కాలమే నిర్ణయిస్తుంది.




# 'సిందూరం' కొత్త పథకమా?



ప్రతి ఇంటికీ సిందూరాన్ని పంపిస్తామని వాళ్లు (బీజేపీ) చెప్తున్నారు. మీ ఇంటికి సిందూరాన్ని పంపిస్తే, మీరు మోదీ పేరు మీద సిందూరం పెట్టుకుంటారా? 'ఒక దేశం-ఒకే భర్త' అనేది మీ కొత్త పథకమా?'

**- భగవంత్ మాన్,** పంజాబ్ సీఎం